# నమస్తే తెలంగాణ

## ఖమ్మం

5 | ఖమ్మం, శుక్రవారం 2 ఆగస్టు 2024 | KHAMMAM




అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తూ నిరసన తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

# రేవంత్ క్షమాపణ చెప్పాల్సిందే..

- బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు
- పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ
- మహిళా సభ్యులను సీఎం అవమానించడం పట్ల భగ్గుమన్న శ్రేణులు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళనలు.. దిష్టిబొమ్మల దహనాలు
- అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్

మణుగూరు టౌన్/ఖమ్మం కమాన్‌బజార్/ఇల్లెందు రూరల్/సత్తుపల్లి, ఆగస్టు 1 : అసెంబ్లీ సాక్షిగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని పార్టీ శ్రేణులు విమర్శించాయి. మహిళలంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీస గౌరవం లేదని ధ్వజమెత్తాయి. మహిళా శాసనసభ్యులపై సాక్షాత్తూ ముఖ్యమంత్రే అనుచిత వ్యాఖ్యలు చేయడం ఇందుకు నిదర్శనమని స్పష్టం చేశాయి. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితోపాటు మరో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండిస్తూ బీఆర్ఎస్ అధిష్ఠానం పిలుపుమేరకు పార్టీ శ్రేణులు ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా గురువారం ఆందోళనలు చేపట్టాయి. ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు, సీఎం దిష్టిబొమ్మల దహనాలు నిర్వహించాయి. మణుగూరులో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, ఇల్లెందులో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, ఖమ్మంలో పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మణుగూరులో రేగా కాంతారావు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇల్లెందులో హరిప్రియ నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి నిరసన తెలిపారు. ఖమ్మంలో పార్టీ నేతలు ధర్నా, నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇక్కడ ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. అలాగే సీఎం దిష్టిబొమ్మను పార్టీ శ్రేణులు దహనం చేయబోగా పోలీసులు అడ్డగించారు. కార్యకర్తల వద్ద నుంచి దిష్టిబొమ్మను లాక్కొని పోలీసుల వాహనంలో వేసుకున్నారు. కాగా, బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కూడా ఒక ప్రకటనలో ఖండించారు. సాక్షాత్తూ అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి.. మహిళా సభ్యులను అవమానించడం, అందుకు డిప్యూటీ సీఎం భట్టి వంతపాడడం సిగ్గుచేటని విమర్శించారు.



మణుగూరు టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, పార్టీ శ్రేణులు

### బేషరతుగా క్షమాపణ చెప్పాలి

మణుగూరులో జరిగిన నిరసనలో రేగా కాంతారావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, మహిళా ఎమ్మెల్యేలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సబితా ఇంద్రారెడ్డిని శాసనసభ సాక్షిగా అవమానించడంతో ఆమె తీవ్ర మనోవేదనకు గురయ్యారని అన్నారు. ఇల్లెందులో హరిప్రియ మాట్లాడుతూ.. తెలంగాణలో మహిళలకు కనీసం గౌరవం కూడా ఇవ్వలేని సీఎం ఉండడం దురదృష్టకరమని అన్నారు. ఇప్పటి అసెంబ్లీ గౌరవ సభలా కాకుండా.. కౌరవ సభలా ఉందని ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. సభానాయకుడిగా ఉన్నానన్న సోయికూడా లేకుండా రేవంత్‌రెడ్డి ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ఖమ్మంలో పగడాల నాగరాజు మాట్లాడుతూ.. సభా సంప్రదాయాలను తుంగలో తొక్కిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రతిపక్షాల గొంతునొక్కుతోందని, మహిళా ఎమ్మెల్యేల పట్ల అమానుషంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఆయా నిరసన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఖమ్మం కమాన్‌బజార్: నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ ఖమ్మం నగర నాయకులు



కొత్తగూడెంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు



బీఆర్ఎస్ నాయకుల ధర్నాను అడ్డుకుంటున్న పోలీసులు

# సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

### ఎస్సీ వర్గీకరణకు మా పార్టీ ఆది నుంచీ కట్టుబడి ఉంది

### బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు



ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. ఈ తీర్పుతో మాదిగలు చేసిన పోరాటం ఫలించిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ ఆదినుంచీ కట్టుబడి ఉందని, వర్గీకరణ కోసం చిత్తశుద్ధితో కృషి చేసిందని గుర్తుచేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో గురువారం రవిచంద్ర ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ అంశంపై మిగతా రాజకీయ పార్టీలు ఓట్ల కోసం నాటకాలు ఆడాయని, రాజకీయం చేశాయని, ఎస్సీలను మోసం చేశాయని విమర్శించారు. తమ పార్టీ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే ఈ అంశాన్ని రాజకీయంగా కాకుండా సామాజిక న్యాయంలో భాగంగా చూసి సంపూర్ణ మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. సుప్రీం తీర్పును గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వర్గీకరణ ప్రక్రియ ప్రారంభించాలని కోరారు.

# సుప్రీంకోర్టు తీర్పు చరిత్రాత్మకం

### సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



మాట్లాడుతున్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

ఖమ్మం కమాన్‌బజార్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణ అంశంపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు సండ్ర వెంకటవీరయ్య పేర్కొన్నారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ ఉద్యమనేత కేసీఆర్.. సీఎం హోదాలో గతంలోనే అప్పటి ప్రధాని మోదీకి వినతిపత్రం ఇచ్చారని గుర్తుచేశారు. 1965లో లాల్ బహదూర్ శాస్త్రి మంత్రివర్గంలో ఎస్సీ వర్గీకరణకు తొలి అడుగులు పడ్డాయని జ్ఞప్తికి తెచ్చారు. 1995లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మేరీ అనే యువతి ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీ భవనంపై నినాదాలు చేసిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు ప్రతి ఒక్కరి విజయమని అన్నారు. ఖమ్మం రూరల్ ఎంపీపీ బెల్లం ఉమ, బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు బెల్లం వేణు, ఉప్పల వెంకటరమణ, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీశ్, నెమలి కిశోర్, హెచ్చు ప్రసాద్, వీరభద్రం, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలతోనే బిడ్డల ఆరోగ్యం

- భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్
- తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 1 (నమస్తే తెలంగాణ) : పుట్టిన బిడ్డకు ఎన్నో పోషకాలున్న తల్లిపాలు పట్టించాలని, అప్పుడే బిడ్డ ఆరోగ్యంగా ఎదుగుతాడని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ప్రసవించే తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, ఆరోగ్య శాఖ సమన్వయంతో తల్లిపాల సంస్కృతి వల్ల తల్లులకు, పిల్లలకు కలిగే ప్రయోజనాలపై వివరించాలని, బిడ్డ పుట్టిన మొదటి గంటలోపే ముర్రుపాలు తాగించాలని, వాటిలో ఎన్నో పోషక విలువలు ఉంటాయన్నారు. ఈ నెల మొదటి వారంలో నిర్వహించే అంతర్జాతీయ తల్లిపాల వారోత్సవాలను క్షేత్రస్థాయిలో షెడ్యూల్ ప్రకారం నిర్వహించి మెరుగైన ఫలితాలు రాబట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత, పోషణ్ అభియాన్ జిల్లా సమన్వయకర్త పొనుగోటి సంపత్, జిల్లా ప్రాజెక్టు అసోసియేట్ రాము, ప్రాజెక్టు స్థాయి కో ఆర్డినేటర్లు రామకృష్ణ, శ్రీకాంత్, సోనీ పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై 1930కి కాల్ చేయండి..

- గంటలో ఫిర్యాదు చేస్తే ఖాతా స్తంభింపజేస్తాం..
- పోలీస్ అధికారుల సమీక్షలో సీపీ సునీల్ దత్



సమీక్షలో మాట్లాడుతున్న సీపీ సునీల్ దత్

రఘునాథపాలెం, ఆగస్టు 1 : సైబర్ నేరగాళ్ల బారినపడి సొమ్ము పోగొట్టుకున్న బాధితులు(గోల్డెన్ అవర్) గంట వ్యవధిలో 1930కి కాల్ చేయడం ద్వారా దొంగిలించిన మొత్తాన్ని స్తంభింపజేసే అవకాశం ఉంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. గురువారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ అధికారులతో జరిగిన నేర సమీక్షా సమావేశంలో పోలీస్‌స్టేషన్ల వారీగా సైబర్ నేరాలు, ఎన్డీపీఎస్ యాక్ట్, పోక్సో కేసులు, రోడ్డు ప్రమాదాలు, గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసులలో చేసిన దర్యాప్తు, విచారణ స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతిపై సీపీ సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల్లో ఫిర్యాదు చేయడం ఆలస్యమైతే నేరగాళ్లు కాజేసిన సొమ్మును వేర్వేరు అకౌంట్లకు బదిలీ చేసి దేశంలోని మారుమూల ప్రాంతాల బ్యాంకుల నుంచి డ్రా చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తద్వారా దర్యాప్తు, రికవరీ మరింత ఆలస్యమవుతుందన్నారు. సైబర్ క్రైమ్‌కు గురైన గంటలోనే 1930కి కానీ cybercrime.gov.in కానీ ఫిర్యాదు చేయాలన్నారు. మాదక ద్రవ్యాలు సరఫరా చేసే వారిపై అత్యంత కఠినంగా వ్యవహరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. కొత్త క్రిమినల్ చట్టాల అమల్లో పోలీస్ అధికారులు మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాదరావు, అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేశ్‌కుమార్, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, రెహమాన్, రఘు, శ్రీనివాసరావు, వెంకటేశ్, ప్రసన్నకుమార్, రవి, ఫణీందర్, సాంబరాజు, మల్లయ్య, భోజరాజు, సుశీల్‌సింగ్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# తహసీల్ ఎదుట 'మాస్‌లైన్' ధర్నా

- ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్
- ఈ నెల 8న కలెక్టరేట్ ఎదుట ధర్నా, 21న 'చలో హైదరాబాద్'కు పిలుపు




ఖమ్మం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు, కార్యకర్తలు

రఘునాథపాలెం, ఆగస్టు 1 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఖమ్మం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. తొలుత కాల్వొడ్డు నుంచి పీఎస్ఆర్ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్ మాట్లాడుతూ హామీల్లో భాగంగా ఆరు గ్యారెంటీలను సీఎం రేవంత్‌రెడ్డి కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారని, అధికారం చేపట్టి ఏడు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం వాటి ఊసెత్తడం లేదని మండిపడ్డారు. ఖమ్మం నగరంలో గత కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు వందలాదిగా ఖాళీగా ఉన్నాయని, రాజీవ్ గృహకల్ప పథకంలో నిర్మించిన 700 ఫ్లాట్లు ఖాళీగా ఉన్నాయని, వాటిని వెంటనే పేదల ప్రజలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఈ నెల 8న పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో కలెక్టరేట్ ఎదుట ధర్నా, ఈ నెల 21న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి ఝాన్సీ శిరోమణి, శోభ, సురేశ్, జాస్మిన్, శారధ, లెనిన్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్, కేశవులు, అంజలి, పద్మ, మౌనిక, రామారావు, అనంత తదితరులు పాల్గొన్నారు.

# జీవత్వం ఉట్టిపడేలా కళారూపాలు

### భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్



చిత్ర, కళారూపాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపహాడ్, ఆగస్టు 1 : గిరిజనులు నిరంతరం శ్రమించి తమ స్వహస్తాలతో తీర్చిదిద్దిన కళారూపాలు జీవత్వం ఉట్టిపడేలా ఉన్నాయని, వీటి ఖ్యాతి ఖండాంతరాలు దాటాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆకాంక్షించారు. భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలో నాయకపోడు, కోయా కల్చర్‌కు సంబంధించి తయారీ కేంద్రంలో చిత్ర కళారూపాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో నివసించే ఆదివాసీ గిరిజన కుటుంబాల్లో ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలు, జీవనశైలి విభిన్నంగా ఉంటుందన్నారు. వారు రూపొందించిన చిత్రాలు, కళారూపాలు ప్రముఖులు ఐటీడీఏ కార్యాలయాన్ని సందర్శించిన సమయంలో అందిస్తే వాటికి మరింత ప్రాచుర్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజ్, మ్యూజియం ఇన్‌చార్జి వీరస్వామి, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రఘునాథపాలేనికి.. స్వామి నారాయణ ట్రస్ట్ గురుకుల విద్యాలయం

- 13.07 ఎకరాలను కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వం
- సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి తుమ్మల కృతజ్ఞతలు



గురుకుల విద్యాలయం ఏర్పాటుపై ట్రస్ట్ బాధ్యుడితో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

రఘునాథపాలెం, ఆగస్టు 1: రఘునాథపాలెం మండలంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో స్వామి నారాయణ ట్రస్ట్ గురుకుల విద్యాలయం ఏర్పాటు కానుంది. గురుకుల విద్యాలయం వేదికగా కేజీ నుంచి ఇంటర్ వరకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం స్వామి నారాయణ ట్రస్ట్‌కు 13.07 ఎకరాలను మార్కెట్ ధరకు కేటాయించింది. ఈ మేరకు భూమిని కేటాయించినందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అత్యున్నత ప్రమాణాలతో అంతర్జాతీయ విద్యాసంస్థలకన్నా తక్కువ ఫీజులతోనే సీబీఎస్ఈ సిలబస్‌తో విద్యాలయం కొలువుదీరబోతున్నట్లు మంత్రి గురువారం తెలిపారు. స్వామి నారాయణ ట్రస్ట్ భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా ఉంటుందన్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలతోపాటు చుట్టు పక్కల జిల్లాలకు చెందిన 500 మంది విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందుతుందని అభిప్రాయపడ్డారు. దేశ వ్యాప్తంగా 58 గురుకుల విద్యాసంస్థలను స్థాపించడంతోపాటు అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా దేశాల్లో గురుకులాలను ఏర్పాటు చేసి అత్యున్నత ప్రమాణాలతో చక్కని వసతి, భోజన సదుపాయాలతో విద్యను అందిస్తున్నట్లు వివరించారు. జాతీయస్థాయి విద్యారంగంలో అనేక అవార్డులను పొందిన స్వామి నారాయణ ట్రస్ట్ గురుకుల విద్యాలయం ఖమ్మం జిల్లాకు రానుండడం భావి విద్యార్థుల వరంగా అభివర్ణించారు. గురుకుల విద్యాలయం రాకతో ఉద్యోగ అవకాశాలూ లభిస్తాయన్నారు.

# వర్గీకరణపై సుప్రీం తీర్పు పట్ల హర్షాతిరేకాలు



సత్తుపల్లిలో సండ్ర క్యాంపు కార్యాలయంలో హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

ఎస్సీ వర్గీకరణ కోసం సుదీర్ఘకాలంగా సాగిన పోరాటానికి, అందుకు తోడైన బీఆర్ఎస్ కృషికి ఫలితం లభించింది. వర్గీకరణ అంశంపై దేశ అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పుతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మాదిగలు సంబురాలు జరుపుకుంటున్నారు. వర్గీకరణ ఉద్యమాన్ని అనేక పార్టీలు తమ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నాయి. కానీ అదే సమయంలో బీఆర్ఎస్ మాత్రం వారి పోరాటాన్ని సామాజిక న్యాయం కోణంలో చూసింది. వారి పోరాటానికి సంపూర్ణ మద్దతునిచ్చింది. పదేళ్ల క్రితం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అవిరళ కృషిచేసింది. సాక్షాత్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడం, స్వయంగా అప్పటి కేసీఆరే ఢిల్లీకి వెళ్లి ప్రధానికి వినతులు అందించడం వంటి చర్యలు చేపట్టింది. మాదిగల పోరాటం, బీఆర్ఎస్ కృషి నేపథ్యంలో సుప్రీంకోర్టు తాజాగా చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఎస్సీ వర్గీకరణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాధికారంగా స్పష్టంచేసింది. దీంతో మాదిగ సామాజిక వర్గ ప్రజలు, ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా సంబురాలు జరుపుకున్నారు.

*–నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఆగస్టు 1*

# కరకట్ట నిర్మాణానికి నిధులివ్వండి..

### సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యేలు తెల్లం, పాయం వినతి



సీఎంకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యేలు

సారపాక, ఆగస్టు 1 : వరదలతో గోదావరి పరీవాహక ముంపు ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కరకట్ట నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని భద్రాచలం, పినపాక ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు కోరారు. గురువారం సీఎంను హైదరాబాద్‌లో వారు కలిసి రెండు నియోజకవర్గాల్లో అభివృద్ధి, గోదావరి వరదల నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజల సమస్యలను వివరించారు. ఏటా వరదలతో భద్రాచలం పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాలు ముంపునకు గురవుతున్నాయని, బూర్గంపహాడ్ మండలం సంజీవరెడ్డిపాలెం నుంచి అశ్వాపురం మండలం అమ్మగారిపల్లె వరకు కరకట్ట నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. గోదావరికి ఇరువైపులా కరకట్ట నిర్మాణం చేపట్టాలని వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం.. కరకట్ట నిర్మాణం కోసం త్వరలోనే రూ.4 వేల కోట్ల నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యేలకు చెప్పారు. వారి వెంట మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ ఉన్నారు.

# మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ జేడీగా శ్రీనివాస్



ఉప్పల శ్రీనివాస్

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 1 : రాష్ట్ర మార్కెటింగ్ శాఖలో గురువారం జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్‌గా ఉప్పల శ్రీనివాస్ హైదరాబాద్ నుంచి బదిలీపై రానున్నారు. గతంలో మార్కెటింగ్ శాఖ ఉప సంచాలకుడిగా పనిచేసిన సమయంలో ఖమ్మం ఏఎంసీలో జాతీయ వ్యవసాయ మార్కెట్ విధానం(ఈ–నామ్) అమలు విజయవంతం కావడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. అడ్తీ వ్యాపారులు రైతుల వద్ద రూ.2 చొప్పున కమీషన్ తీసుకునే క్రమంలో చేపట్టిన విజిలెన్స్ తనిఖీల్లో తన మార్క్ చాటారు. అయితే మరోసారి ఇదే రీజియన్‌కు జేడీగా రావడంతో మార్కెట్ అభివృద్ధిలో మరింత కీలకం కానున్నారు. అలాగే గతంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారిగా పని చేసిన పద్మావతి వరంగల్ రీజియన్ ఉప సంచాలకులుగా బదిలీ అయ్యారు.